



ప్రేయరైంది

పిల్లల్ని లైన్లో క్లాసులకు పంపిస్తున్నాడు పి.ఇ.టి.

టీచర్స్ బెల్ కొట్టాడు అయిలయ్య. వాడు ఎప్పటి నుంచో ఆ స్కూల్లో అటెండరుగా పనిచేస్తున్నాడు. డ్యూటీ అంటే అతగాడికి ప్రాణం. అధికారి అంటే అతడి దృష్టిలో దేవుడు. ఎవరేపని చెప్పినా విసుక్కోకుండా చేస్తాడు. అయిలయ్య బడికి రాని రోజు అందరికి ఏదో వెలితిగా ఉంటుంది.

"టైమయింది ఇక మీరు క్లాసులకు వెళ్లండి" తన చుట్టూ నిలబడ్డ టీచర్స్‌ని ఉద్దేశించి అన్నారు. ప్రధానోపాధ్యాయులు విశ్వనాథం గారు. ట్రాన్స్‌ఫర్ మీద ఆయన ఆ ఊరొచ్చి నెల రోజులవుతోంది.

అతని ఆదేశానుసారం అంతా తరగతి గదుల్లోకి వెళ్ళిపోయారు.

హెడ్మాస్టరు కంటపడటమిష్టంలేక నక్కుతూ వెళుతున్నాడు నారాయణ. వాడు ఆ

స్కూల్లో స్వీపర్ కమ్ నైట్ వాచరు.

వాడిని అల్లంత దూరంలో చూసిన విశ్వనాథం గారు "నైట్ వాచర్ని ఇలా పిల్చుకురా" అన్నారు.

పరుగున వెళ్లి నారాయణ్ణి లాక్కొచ్చాడు అయిలయ్య,

లుంగి, చారల బనియన్లో ఉన్న నారాయణ్ణి ఎగాదిగా చూసారు విశ్వనాథంగారు. వాడి కళ్ళల్లో ఎక్కడా విధేయత కానరావడం లేదు.

"ఏవయ్యా, రోజూ బడికొస్తున్నావా?" అడిగారు విశ్వనాథం.

"సంతకాల పుస్తకం చూస్తే తెలుస్తుంది. నన్నడగడం దేనికి" గుడ్లు మిటకరిస్తూ సమాధాన మిచ్చాడు నారాయణ.

వాడి నిర్లక్ష్య ధోరణికి వళ్ళు మండింది విశ్వనాథానికి. ఏం చూసుకుని వాడలా మిడిసిపడుతున్నాడో తెలీడంలేదు.

"రిజిస్టర్లో సంతకం చేస్తే సరిపోదు" కాస్త కటువుగా అన్నారు విశ్వనాథం.

"మరేం చేయాలో చెప్పండి".

"ముందు నీ పద్ధతి మార్చుకోవాలి".

"రోజూ నేను మీకు కనిపించడంలేదనేగా ఈ అక్కసంతా" నిష్టూరంగా పలికాడు నారాయణ.

వాడి ధోరణి విశ్వనాథానికేమాత్రం మింగుడు పడటంలేదు. తన పాతికేళ్ళ సర్వీసులో ఇంతవరకు అటువంటి వ్యక్తిని చూడలేదు.

"కనిపించనక్కరలేదు. నీ పని నువ్వు చేసుకుపోతే చాలు" అన్నారు వాడి మాటకు ఏమనాలో తెలీక.

"బడి పెట్టకముందే పని పూర్తిచేసుకుపోతున్నాను".

"ఊహు. నువ్వు చీపురు పట్టుకున్నట్లు నాకేం అనిపించడంలేదు. చూడు ఎక్కడి చెత్త అక్కడే ఎలా పడివుందో! గ్రౌండ్లో పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నా పట్టించుకోవడంలేదు. ఎవరు తాగి పడేస్తున్నారో ఏంటో క్లాస్ రూమ్స్ వెనక ఖాళీ బ్రాందీ బాటిల్స్ పడున్నాయి. వాటిని ఏరి పారేయాలన్న ఇంగితం కూడ లేదా నీకు" కోపంగా అడిగారు విశ్వనాథం గారు.

"పనివిషయంలో నన్నింత వరకు ఎవరూ వేలెత్తి చూపలేదు. నేనెవరితాలూకో తెలీక మీరలా మాట్లాడుతున్నారు."

నారాయణ బెదిరింపు ధోరణి విశ్వనాథానికి చిర్రెత్తుకొచ్చింది.

"అది నాకనవసరం. ఇక మీదట పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి. లేకపోతే నీ మీద చర్య తీసుకోవలసి వస్తుంది. అది తెలుసుకుని మసలుకో" అంటూ హెచ్చరించారు.

ఆ మాటకు మరింత రెచ్చిపోయాడు నారాయణ.

విశ్వనాథం కూడా ఊరుకోలేదు.

మాట మాట పెరిగింది.

క్లాస్‌రూమ్స్‌లో ఉన్న టీచర్స్ గుమ్మాల దగ్గరకొచ్చి వారి సంభాషణ వింటూ వినోదించసాగారు. తామెవ్వరూ చేయలేని పని నారాయణ చేస్తున్నందుకు వాడిని మనసులోనే అభినందించారు. ఈ దెబ్బతో హెచ్ ఎమ్ ఔట్ అనుకున్నారంతా.

"ఏం చూసుకుని నువ్వలా రెచ్చిపోతున్నావో తెలీడంలేదు. ఈ రోజే నీ గురించి ఉన్నతాధికారులకు రాస్తాను. నిన్నిక్కడ నుంచి బదిలీ చేయిస్తాను. నీలాంటివాడు నా దగ్గర పనిచేయ లేడు. నోర్మూసుకుని వెళ్లిక్కడ నుంచి" కసురుకున్నారు విశ్వనాథంగారు. కోపంలో అతని మొహం కందగడ్డలా మారి పోయింది.

"చూద్దాం ఎవరికి బదిలీ అవుతుందో" బెట్ కాస్తున్నట్లు గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు నారాయణ.

వాడు అంతలేసి మాటలు అంటాడనుకోలేదు విశ్వనాథం. అందరి ముందు అతడికి తల తీసేసినట్టైంది. అనవసరంగా వాడితో ఘర్షణపడ్డానా అనిపించింది. సీట్లోకెళ్ళి కూర్చున్నాడన్న మాటే గాని మనసు కుదుటపడటంలేదు.

అతని అవస్థను గమనించిన అయిలయ్య "తొందరపడ్డారేమో మాష్టారు. వాడి నోట్లో నోరు పెట్టకుండా ఉండవలసింది" అన్నాడు అనునయంగా.

"ఏవయ్యా నాకు తెలీక అడుగుతాను. ఇంతకు ముందున్న హెడ్మాస్టర్లెవరూ వాడిని పట్టించుకునేవారు కాదా?" చిరాగ్గా అడిగారు విశ్వనాథంగారు.

"లేదండి. వాడు ఎమ్.ఎల్.ఎ. గారి కేండిడేటు కావడం వల్ల వాడి ఊసెత్తేవారు కాదు. ఏమంటే ఏమొస్తుందోనని వాళ్ళ భయం. అందుకే వాడికా పొగరు" కసిగా అన్నాడు అయిలయ్య.

"సరేలే, నువ్వెళ్ళి టీచర్లకు అటెండెన్స్ రిజిస్టర్లు ఇచ్చిరా" అన్నారు విశ్వనాథంగారు మరి అతడితో సంభాషణ పొడిగించడం ఇష్టంలేక.

వెళ్ళిపోయాడు అయిలయ్య.

విశ్వనాథంగారికి జిల్లాలో ప్రధానోపాధ్యాయుడిగా మంచి పేరుంది. వృత్తినే దైవంగా నమ్ముకున్న వ్యక్తి. ప్రిన్సిపుల్స్‌కు కట్టుబడిన మనిషి. తనలాగే తన వద్ద పనిచేసే సిబ్బంది కూడా అంకిత భావంతో పనిచేయాలనుకుంటారు.

ఆ స్కూల్లో జాయినైన తొలి రోజునే బడి ఎంత అధ్వాన్న స్థితిలో వుందో విశ్వనాథానికి అర్థమైపోయింది. పిల్లల సంఖ్య మూడొందలైతే ఆవేళ పట్టుమని ముప్పైమందైనా లేరు. పనివేళలతో సంబంధం లేకుండా వచ్చిన టీచర్స్ కొత్తగా చేరిన హెచ్.ఎమ్.ని చూసి

అవాక్కయ్యారు. ఆ రోజే తామంతా లేటయ్యామని సంజాయిషి ఇచ్చుకున్నారు. విద్యార్థుల హాజరు పుస్తకాలు తెరిచి చూస్తే రోజూ శత శాతం హాజరు కనబడుతోంది. అంటే, పిల్లలు వచ్చినా రాకున్నా మాస్టార్లు హాజరు వేసేస్తున్నారన్నమాట. మతి పోయిందాయనకి. వెంటనే స్టాఫ్ అందర్నీ సమావేశ పరిచారు. టైముకి అందరూ బడికి రావాలని, విధి నిర్వహణలో అలసత్వం పనికి రాదని హితబోధ చేసారు. అక్కడితో ఊరుకోకుండా పనిచేసే చోటే టీచర్సంతా నివాసముండాలని సర్క్యులర్ జారీ చేసారు.

స్కూల్లో గేమ్స్ ఎక్విప్‌మెంటు లేకపోవడం వల్లే ఆటలాడించలేక పోతున్నానని డ్రిల్లు మాస్టారు తప్పించుకోజూసాడు. అయితే విశ్వనాధంగారు అప్పటికప్పుడు స్పెషల్ ఫీ అకౌంట్ నుంచి డబ్బులు డ్రాచేసి ఆటవస్తువుల్ని కొనిపించారు. ఒక్కో ఉపాధ్యాయుడూ పదిమంది టెన్త్ విద్యార్థుల్ని దత్తత తీసుకుని వాళ్ళని బడి అయ్యాక కూర్చోబెట్టి చదివించాలన్నారు. వాళ్ళతోపాటు తను కూడా సాయంత్రం ఆరుగంటల వరకు స్కూల్లో ఉంటున్నారు.

ఏనాడూ నోరు విప్పని ఉపాధ్యాయులు నేడు గొంతు చించుకుని పాఠాలు చెబుతున్నారు. అడిగే నాధుడు లేనందున ఇంతకాలం మాష్టర్ల ఇష్టారాజ్యమైంది. పంతుళ్ళ తిక్క కుదిర్చే పెద్ద మాస్టారు రావడంతో వాళ్ళ ఆటలకు అంతరాయ మేర్పడింది. పూర్తిగా స్వేచ్ఛకు అలవాటు పడిపోయిన టీచర్లకిప్పుడు జైల్లో పెట్టినట్లయింది. అయిష్టంగానైనా అదికారి చెప్పింది చెయ్యక తప్పడంలేదు. కొత్త హెచ్.ఎమ్.వచ్చాక స్కూల్లో జరుగుతున్న మార్పుల్ని గమనించిన గ్రామస్తులు ఇక ముందైనా తమ పిల్లలకి నాలుగు అక్షరం ముక్కలు అబ్బుతాయని సంబరపడుతున్నారు.

ఇటువంటి తరుణంలో నైట్‌వాచరు హెచ్.ఎమ్.మీద తిరగబడటం టీచర్లందరికి ఎంతో వేడుకగా ఉంది. వాడు ఎమ్.ఎల్.ఎ గారికి కావలసిన వాడు. ఆయనతో ఒక్క ముక్క చెబితే చాలు హెచ్.ఎమ్.కి ఉద్వాసన తప్పదు. పైగా విశ్వనాధంగారు బదిలీ అయ్యేంత వరకు తను బడిలో కాలుపెట్టనని నారాయణ భీకర ప్రతిజ్ఞ చేసాడు. ఎలాగో అలాగ తమను రాచి రంపాన పెడుతున్న బాస్ పీడ విరగడైపోతే చాలనుకున్నారు అందరూ. అన్నట్లుగానే ఆ రోజు నుంచి బడికి రావడం లేదు నారాయణ. వాడు ఆ పనిలోనే ఉన్నాడనుకున్నారంతా.

రోజూ పోస్టుమాన్‌ని గేటువద్దే నిలబెట్టి వాడి చేతుల్లోంచి ఉత్తరాలు లాక్కుని శల్యపరీక్షచేసి మరీలోనికి పంపిస్తున్నారు టీచర్లు. విద్యాశాఖాధికారి కార్యాలయం నుండి ఏదైన కవరు వస్తుందేమోనని వారి ఆశ.

ఒక రోజు వారి ఆశ ఫలించింది. పోస్టుమేను పట్టుకొచ్చిన ఉత్తరాలలో డి.ఇ.ఒ. ఆఫీసునుంచి వచ్చిన కవరు ఉంది.

అది సెంట్‌పర్సెంట్ హెచ్.ఎమ్. ట్రాన్సఫర్ ఆర్డరే. అందులో సందేహం లేదనుకున్నారు. అంతలో అయిలయ్య గబగబా వచ్చి వాళ్ళచేతుల్లోంచి టపాఅందుకుని ప్రధానోపాధ్యాయుడి బల్లమీద పెట్టాడు.

విశ్వనాధంగారు క్లాసులో ఉన్నారు. గంటకొడితే తప్ప గదిలోంచి బయటపడరు.

వచ్చాక కవర్లన్నీ విప్పితే తప్ప విషయం బయటపడదు. క్షణాలు గడుస్తున్న కొద్దీ టీచర్స్‌లో టెన్షన్ పెరిగిపోతోంది. క్లాసులో ఉన్నారన్న మాటేగాని వారి దృష్టి అంతా విశ్వనాధంగారు తెరవబోయే కవరు మీదే ఉంది. "త్వరగా బెల్లుకొట్టరా నాయనా టైమయింది" అన్నారు అటెండర్ని పిలిచి. వారి ఆరాటాన్ని చూసి ముసి ముసిగా నవ్వుకున్నాడు అయిలయ్య. బెల్ అవుతూనే క్లాస్ రూం నుంచి వచ్చిన విశ్వనాధం, ఆ రోజు వచ్చిన కవర్లు ఒక్కొక్కటి విప్పి చదవడం మొదలుపెట్టారు.

అయిలయ్య కూడా అక్కడే హెచ్.ఎమ్.కి కాస్త దూరంగా నిలబడ్డాడు. వాడికీ టెన్షన్‌గానే ఉంది.

చివరిగా డి.ఇ.ఓ ఆఫీసు నుండి వచ్చిన కవర్ని తెరిచి "అయిలయ్యా!" అంటూ కేకవేశారు.

అక్కడే ఉన్న అయిలయ్య "సార్" అంటూ దగ్గర కొచ్చాడు. "నారాయణకి బదిలీ అయింది. వాడెక్కడున్నా పిలుచుకురా. ఆర్డరు సర్వుచెయ్యాలి" కళ్ళజోడు తీసి బల్లమీద పెడుతూ అన్నారు విశ్వనాధం గారు.

క్షణాల మీద గుప్పుమంది వార్త. విషయం తెలుసుకున్న స్టాఫ్ ఖంగుతిన్నారు. "హెచ్.ఎమ్.కి బదిలీ అవుతుందేమో అనుకుంటే ఇలా జరిగిందేంటి ?" అనుకుని తలలు పట్టుకున్నారు.

అయిలయ్య మాత్రం నారాయణకి తగిన శాస్తే జరిగిందనుకుని సంతోషించాడు.

అసలు జరిగిందేమిటంటే... నైట్‌వాచర్ నారాయణ తనతో పోట్లాట పెట్టుకున్న రోజే విశ్వనాధం ఎమ్.ఎల్.ఎ గారింటికెళ్లారు.

అప్పటికే ఎమ్.ఎల్.ఎ నాగరాజు గారి దర్శనార్థం ఛోటా మోటా నాయకులు కొందరు వరండాలో నిరీక్షిస్తున్నారు. తిన్నగా వాళ్ళ వద్దకెళ్లి తనూ బెంచీమీద కూర్చున్నారు విశ్వనాధం. ఆయన మనసెందుకో బితుకు బితుకు మంటోంది.

ఎమ్.ఎల్.ఎ గారితో మాట్లాడి బయటకొచ్చారు ఇద్దరు వ్యక్తులు. "అర్జంటైతే ముందు మీరు వెళ్ళండి మాష్టారు మాకేం తొందరలేదు" అన్నారు ప్రక్కనున్నవాళ్లు.

"థాంక్సండి" అంటూ లేచి లోనికెళ్ళి నాగరాజు గారిని విష్ చేసారు విశ్వనాధం.

కూర్చోమన్నట్లు కుర్చీచూపించారు ఎమ్.ఎల్.ఎ గారు.

తనను తాను పరిచయం చేసుకున్నారు విశ్వనాధం.

"మీ గురించి విన్నాను. ఊళ్లోనే నివాసముంటూ పాఠశాలను క్రమశిక్షణతో నడుపుతున్నారట కదా! ... మీ ఊరి సర్పంచిగారు చెప్పారు లెండి" అభినందిస్తున్నట్లు అన్నారు నాగరాజుగారు.

ఆ మాటతో రవంత ధైర్యం వచ్చింది విశ్వనాధానికి.

"ఇంతకీ ఏం పనిమీద వచ్చారో చెప్పండి."

ఎమ్.ఎల్ఎగారి ప్రశ్నకు కాస్త తడబడుతూ "అబ్బే పనంటే పెద్దపనికాదు మా స్కూల్లో నైట్‌వాచరు." అంటూ ఆగారు విశ్వనాధంగారు.

"వాడికా స్కూల్లో ఉద్యోగం వేయించింది నేనే. సరిగ్గా పనిచేస్తున్నాడా" అడిగారు ఎం.ఎల్.ఏ.గారు.

"ఆ మాట చెప్పడానికే వచ్చాను. మీరు మరోలా అనుకోకపోతే నాదో చిన్న అభ్యర్ధన" ఆర్ధోక్తిగా ఎమ్.ఎల్.ఎ గారి వంక చూస్తూ అన్నారు విశ్వనాధం గారు.

"చెప్పండి మాష్టారు సందేహించొద్దు".

ఆ మాటతో కొండంత ధైర్యం వచ్చింది విశ్వనాధానికి. "వాడు రోజూ స్కూల్లో తాగి పడుకుంటున్నాడు. నేను బడికి రాకముందే రిజిస్టర్‌లో సైన్‌చేసి వెళ్లి పోతున్నాడు. ఏ రోజూ పాఠశాల ఆవరణతుడిచిన పాపాన పోలేదు. పిల్లలే తరగతి గదుల్ని శుభ్రం చేసుకుంటున్నారు. అదేమని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నాడు. ఈ విషయాన్ని మీ దృష్టికి తేవడానికి విచారిస్తున్నాను. మీతో చెప్పకుండా వాడిమీద చర్య తీసుకోలేను..."

"అలా అంటారేంటి మాష్టారూ. డ్యూటీ సక్రమంగా చెయ్యనప్పుడు యాక్షన్ తీసుకోకపోతే ఎలా? మీకు ముందున్న హెచ్.ఎమ్స్ ఎవరూ వాడి గురించి నాకు కంప్లైంటు చెయ్యకపోవడంతో వాడు బాగానే పనిచేస్తున్నాడనుకున్నాను" బాధ పడుతున్నట్లు అన్నారు నాగరాజుగారు.

"వాడు మీ కేండిడేటు అవడం వల్ల ఇంత వరకు ఎవ్వరూ మీ ఎదుట నోరు విప్పేసాహసం చెయ్యలేదు. పని చేసినా చేయకున్నా సర్దుకుపోయారు."

"అదేం మాట? వాడికి రకమండ్ చేసి ఉద్యోగం వేయించింది పనిచెయ్యడానికా? తాగి తొంగోటానికా? వాడి సంగతి నాకు వదిలేయండి. మీ విధుల్ని మీరు సక్రమంగా నిర్వర్తించండి. నా సహకారం మీకెప్పుడూ ఉంటుంది."

ఎమ్.ఎల్.ఎ గారిచ్చిన భరోసాతో ఊపిరి పీల్చుకున్నారు విశ్వనాధంగారు. దాని ఫలితమే నారాయణ ట్రాన్స్‌ఫర్.

విశ్వనాధం ఎమ్.ఎల్.ఎగారిని కలిసినట్లు స్టాఫ్ ఎవ్వరికీ తెలీదు. నారాయణ ఎమ్.ఎల్.ఎ గారి కేండిడేటైతే హెచ్.ఎమ్. విశ్వనాధం మంత్రి గారి అభ్యర్ధి అయి ఉంటారనుకున్నారు.

అంతే ఆ రోజు నుంచి హెచ్.ఎమ్. మాట స్కూల్లో వేద వాక్కయింది.

(జూన్ 2010 స్వప్న మాసపత్రిక)